సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం ı 30 ı డిసెంబర్ ı 2024



పర్మిట్ ఇచ్చేశారు!
మద్యం షాపుల పక్కనే పర్మిట్ రూంలు తెరిచారు. బార్లను తలపించేలా సిటింగ్‌ను ఏర్పాటు చేసి మరీ మద్యం తాగిస్తున్నారు.
-8లో



నిజ జీవితాన్ని యథాతథంగా చిత్రించిన సన్నపురెడ్డి
జీవిత వాస్తవాలు యథాతథంగా చిత్రించడంలో సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి దిట్ట అని కవులు, రచయితలు పేర్కొన్నారు.
-8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
30.0/21.0
జిల్లాలో ఆదివారం 21.0 – 30.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

కడప అర్బన్: జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గురునాథ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కానిస్టేబుల్‌గా వున్న ఈయన ఎస్‌ఐ అని చెప్పుకొంటూ ఇతరులను బెదిరించడం, సక్రమంగా విధులు నిర్వర్తించకుండా ఉండటంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. వారు అందించిన నివేదిక ప్రకారం అతనిపై ఎస్పీ వేటు వేశారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నేడు ధర్నా

కడప కోటిరెడ్డిసర్కిల్: కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యవేదిక నాయకులు డాక్టర్ ఓబుల్ రెడ్డి, లక్ష్మిరాజా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు ధర్నా కార్యక్రమం ఉంటుందని వారు పేర్కొన్నారు. అభ్యుదయ, అంబేడ్కర్, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం కలెక్టరేట్ సభా భవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చని వివరించారు.

డయల్ యువర్ కలెక్టర్

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 నుంచి 10 గంటల వరకు జరుగుతుందని డీఆర్వో తెలిపారు. ప్రజలు 08562–244437 ల్యాండ్ లైన్ నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు.

ఉత్సాహంగా పరుగు పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక భగత్‌సింగ్ కాలనీలోని టీవీఆర్ హైస్కూల్ సమీపంలో ఆదివారం జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ (దూరపు పరుగు) పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 16 ఏళ్లలోపు బాలుర 2 కిలోమీటర్ల విభాగంలో చంద్ర ఓబుళరెడ్డి, నజీర్, బాలికల విభాగంలో షేక్‌ఫాతిమా నస్రీన్, ప్రసన్న, 18 ఏళ్లలోపు బాలుర 6 కిలో మీటర్ల విభాగంలో ముని నరేంద్ర, తేజేష్, బాలికల 4 కిలో మీటర్ల విభాగంలో షేక్ ముబీనా, 20 ఏళ్లలోపు బాలుర 8 కిలో మీటర్ల విభాగంలో దేవేంద్ర, గంగాధర్, చిన్నవీరేష్, పురుషుల 10 కిలోమీటర్ల విభాగంలో హేమకిరణ్ నాయక్, శ్రీహరి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు జనవరి 5న పశ్చిమగోదావరి జిల్లా తణుకులో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొననున్నారు. పోటీలను బాషా అథ్లెటిక్ ఫౌండేషన్ కార్యదర్శి వై.అహ్మర్‌బాషా, వ్యాయామ సంచాలకులు వెంకటసుబ్బయ్య, లక్ష్మీదేవి, చరణ్‌కుమార్‌రెడ్డి, నాగేశ్వరరావు, సంజీవ్, దిలీప్, ఖాదర్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారుడు రబ్బాని పర్యవేక్షించారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: భూ సమస్యల పరిష్కారానికై ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 19 గ్రామాలలో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బద్వేలు రెవెన్యూ డివిజన్‌లోని అట్లూరు మండలం కమలకూరు, బి.కోడూరు మండలం వేమకుంట, బి.మఠం మండలం గొడ్లవీడు, బద్వేలు మండలం తిరువెంగలాపురం, కలసపాడు మండలం దిగువ తంబళ్లపల్లి, మైదుకూరు మండలం శెట్టివారిపల్లె, పోరుమామిళ్ల మండలం సంచర్ల, పులివెందుల రెవెన్యూ డివిజన్‌లోని చక్రాయపేట మండలం కొండప్పగారిపల్లి, పులివెందుల మండలం ఎర్రబల్లె, జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ లోని జమ్మలమడుగు మండలం కన్నెలూరు, కొండాపురం మండలం కె.వెంకటాపురం, జోగాపురం, మైలవరం మండలం నవాబుపేట, దుగ్గనపల్లి, రాజుపాళెం మండలం చిన్నజొన్నవరం, కడప రెవెన్యూ డివిజన్‌లోని పెండ్లిమర్రి మండలం సంగటిపల్లి, వల్లూరు మండలం లేబాక, ఖాజీపేట మండలం చెమ్ముళ్లపల్లి, చింతకొమ్మదిన్నె మండలం రుద్రయ్యగారిపల్లిలో రెవెన్యూ సదస్సులు జరగనున్నాయని వివరించారు.

దేవుడు వరమిచ్చినా.. ప్రభుత్వం కరుణించలే..!

దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదు అన్న చందంగా ఉంది పరిస్థితి. రబీలో విస్తారంగా వర్షాలు కురవడంతో.. అధిక విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. విత్తనాల సబ్సిడీలో కోత పెట్టింది. పైగా నాసిరకమైనవి మంజూరు చేసింది. దీంతో సరిగా మొలకెత్తక పోవడంతో చాలా చోట్ల దున్నేశారు. మళ్లీ వరుణదేవుడు కరుణించడంతో.. పంటలు వేశారు. ఖరీఫ్‌లోనే అన్నదాత సుఖీభవ నిధులు మంజూరు చేయాల్సి ఉండగా.. రబీలోనూ ఇవ్వలేదు.

- ఆశాజనకంగా రబీ సాగు
- జిల్లా వ్యాప్తంగా 71.33 శాతం మేర సాగు
- సెప్టెంబర్, అక్టోబర్‌లో వర్షాల రాకతో పెరిగిన సైనం
- ఇప్పటికీ అందని అన్నదాత సుఖీభవ నిధులు
- రైతులకు నాసిరకం విత్తనాలు అందజేత
- పంటలు దెబ్బతిన్నా ఆదుకోని సర్కారు



కేసీ కెనాల్ కింద పచ్చగా కళకళలాడుతున్న వరి పైరు



శనగ పంట సరిగా మొలవలేదని చూపుతున్న రైతు (ఫైల్)


కడప అగ్రికల్చర్: జిల్లాలో ఈ ఏడాది రబీ సాగు ఆశాజనకంగా ఉంది. సకాలంలో వర్షాలు కురవడంతో ఆశించిన మేర సాగైంది. ప్రభుత్వం రైతులకు సకాలంలో అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేసి ఉంటే.. సాగుకు మరింత ఊతంగా ఉండేదని పలువురు రైతులు తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వం సబ్సిడీలో కోత పెట్టి శనగ విత్తనాలు మంజూరు చేసింది. అలాగే విత్తనాలు నాసిరకం కావడంతో కొన్ని చోట్ల సరిగా మొలక రాక చాలా మంది శనగ పంటను దున్నేశారు. మళ్లీ వరుణదేవుడు కరుణించడంతో రైతులు బయట ప్రాంతం నుంచి శనగ విత్తనాలు తెచ్చుకుని విత్తుకున్నారు. ఏదిఏమైనా ఎన్ని విపత్తులు ఏర్పడినా.. ఈ ఏడాది పంటల సాగు ఆశాజనకంగానే ఉంది. గతేడాది కంటే ఈ ఏడాది డిసెంబర్ 21వ తేదీ నాటికి 39707 హెక్టార్ల అధిక విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి.

అధిక విస్తీర్ణంలో శనగ

అత్యధిక విస్తీర్ణంలో శనగ పంట సాగైంది. జిల్లా వ్యాప్తంగా శనగ రబీ సాధారణ సాగు విస్తీర్ణం 82261 హెక్టార్లు కాగా.. గతేడాది డిసెంబర్ 21 తేదీ నాటికి 25063 హెక్టార్లలో సాగైంది. అలాంటిది ఈ ఏడాది డిసెంబర్ 21 నాటికి 74,619 హెక్టార్లలో సాగై రికార్డు సృష్టించింది. అంటే గతేడాది కంటే ఈ ఏడాది 49556 హెక్టార్ల అధిక విస్తీర్ణంలో సాగైంది. దీనికి ఈ ఏడాది రబీ ప్రారంభమైన సెప్టెంబర్, అక్టోబర్‌లో వర్షాలు కురవడంతోనే.. అధిక విస్తీర్ణంలో సాగైందని రైతులు తెలిపారు.

1,02,000 హెక్టార్లలో పంటలు సాగు

జిల్లాలో రబీ సీజన్ సాధారణ సాగు 1,42,988 హెక్టార్లకు గాను ఇప్పటికి 102,000 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. జొన్న సాధారణ సాగు విస్తీర్ణం 7917 హెక్టార్లకు గాను 3490 హెక్టార్లలో, మొక్కజొన్న సాధారణ సాగు 1440కు గాను 1988, కంది 202కి గాను 115, పెసలు 3182కి గాను 1235, మినుము 14731కు గాను 13393, ఉలవలు 428కి గాను 1086, వేరుశనగ 6236కి గాను 2006, నువ్వు 5070కి గాను 2175 హెక్టార్లలో సాగయ్యాయి.



అందని అన్నదాత సుఖీభవ నిధులు

పంటల సాగుకు ఎలాంటి ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతో.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రైతుకు రైతు భరోసా పేరుతో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే నగదు మంజూరు చేసే వారు. ఆ డబ్బులతో రైతులు ఎలాంటి అప్పులు చేయకుండా పంటలు సాగు చేసుకునే వారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా రైతులకు ఇస్తామన్న రూ.20 వేల అన్నదాత సుఖీభవ నిధులు ఇప్పటికీ ఇవ్వలేదు. దీంతో చాలా మంది రైతులు అప్పులు చేసుకుని పంటలను సాగు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి రైతు ఖాతాలకు అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేస్తే పంటల సాగుకు రైతులకు అండగా ఉంటుంది. ఆ నిధులను పంటల సాగుకు వినియోగించుకుని అప్పులు చేసుకోకుండా ఉండేందుకు వీలవుతుంది. ప్రభుత్వం స్పందించి అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి. – పోతిరెడ్డి భాస్కర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, (సీపీఐ అనుబంధ, రైతు విభాగం)

పంట దెబ్బతిన్నా ఆదుకోలేదు



రబీ సీజన్‌లో ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ శనగలు చాలా చోట్ల సరిగా మొలకెత్తక పోవడంతో చాలా మంది రైతులు తమ పంటలను దున్నేశారు. కానీ వారిని ప్రభుత్వం ఏ విధంగా కూడా ఆదుకోలేదు. అదే గత ప్రభుత్వంలోనైతే అలాంటిదేమైనా విపత్తు జరిగిన తక్షణమే రైతులకు ఉచితంగా విత్తనాలు ఇవ్వడంతోపాటు పంటలు దెబ్బతింటే ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇచ్చేది. ఇప్పుడు అలాంటిదేమీ ఇవ్వడం లేదు. – దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి, (సీపీఎం అనుబంధ రైతు విభాగం)

సకాలంలో వర్షాలు



ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్‌లో వర్షాలు కురిశాయి. దీంతో పంటల సాగు ఆశాజనకంగా ఉంది. గతేడాది కంటే ఈ ఏడాది సాగు ఇప్పటికే దాదాపు 50 వేల హెక్టార్లలో పెరిగింది. కానీ గతేడాది సెప్టెంబర్, అక్టోబర్‌లో వర్షాలు లేని కారణంగానే సాగు లక్ష్యం చేరుకోలేకపోయాం. కానీ ఈ ఏడాది రబీ సాగు లక్ష్యం మించి పంటలు సాగయ్యే అవకాశం ఉంది. రైతులు కూడా సంతోషంగా ఉన్నారు. – అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి

రైతు కుటుంబం ఆత్మహత్య పట్టదా?

- ప్రభుత్వం బాధ్యత వహించాలి
- పౌర హక్కుల సంఘం నాయకులు



మృతుల బంధువుతో మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం నాయకులు

సింహాద్రిపురం: రైతు కుటుంబం ఆత్మహత్యపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. సింహాద్రిపురం మండలం దిద్దికుంట గ్రామంలోని రైతు కొమెర నాగేంద్ర, శ్రీవాణి, వారి పిల్లల ఆత్మహత్యపై పౌర హక్కుల సంఘం జిల్లా కమిటీ నిజ నిర్ధారణ చేపట్టింది. దిద్దికుంట గ్రామానికి ఆదివారం వెళ్లి మృతుల బంధువులతో మాట్లాడింది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిటీ నాయకులు వాస్తవ విషయాలు వెల్లడించారు. నాగేంద్ర శుక్రవారం రాత్రి పొలం వద్ద మొదట భార్య, తర్వాత పిల్లలకు ఉరి వేశారని, అనంతరం అతను కూడా ఉరి వేసుకుని బలవన్మరణం పొందారని తెలిపారు. అప్పులే వారి ఉసురు తీశాయని పేర్కొన్నారు. నాగేంద్ర తనకు ఉన్న ఒకటిన్నర ఎకరా పొలంతోపాటు 13 ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేశారని తెలిపారు. ఆరేడు ఏళ్ల నుంచి పంట పెట్టుబడుల కోసం రూ.30 లక్షలు పైగా అప్పు చేశాడన్నారు. దిగుబడి సరిగా రాకపోవడంతో అప్పులు పెరిగిపోయాయని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రుణ దాతలు ఒత్తిడి చేయడం.. అప్పుల నుంచి బయటపడే మార్గం కనిపించకపోవడంతో కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుందన్నారు. వ్యవసాయాన్ని నమ్ముకొని ఆరుగాలం కష్టపడి పని చేసిన రైతు కుటుంబం బలవన్మరణం పొందడం బాధాకరమన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఎందుకంటే రైతులకు వ్యవసాయానికి కావాల్సిన మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అన్నారు. కానీ ప్రభుత్వాలు ఇలా చేయకపోవడంతో రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి రాయచోటి రవిశంకర్, ఉపాధ్యక్షుడు పి.రెడ్డయ్య, సహాయ కార్యదర్శి ఎం.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలపై ట్రయల్ రన్

కడప అర్బన్: కడప నగర శివారులోని డీటీసీ (జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం) మైదానంలో సోమవారం నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది కొంత మంది యువకులతో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు ఆదివారం ట్రయల్‌రన్ (రిహార్సల్) నిర్వహించారు. ఆదే విధంగా డీటీసీ మైదానంలో పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమై పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎలా విధులు చేపట్టాలో దిశానిర్దేశం చేశారు. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం నుంచి జనవరి 8 వరకు దేహదారుఢ్య (పీఎంటీ, పీఈటీ) పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం చేసిన ఏర్పాట్లపై అదనపు ఎస్పీ ఆరా తీసి పరిశీలన చేశారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఆర్‌ఎఫ్‌ఐడీ సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (ఏ.ఆర్) బి.రమణయ్య, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసులు, డీపీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



దేహ దారుఢ్య పరీక్షలపై సూచనలు ఇస్తున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు

రాయలసీమపై వివక్ష తగదు



సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీలు, సంస్థల, ప్రజా సంఘాల నాయకులు

- ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలింపు వద్దు
- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల ప్రతినిధులు

కడప కల్చరల్: రాయలసీమపై కూటమి ప్రభుత్వం వివక్ష చూపించడం తగదని ప్రజాసంఘాల ప్రతినిధులు అన్నారు. రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ డాక్టర్ సి.ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి అధ్యక్షతన స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లాలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు హరికిషోర్‌రెడ్డి, అరసం అధ్యక్షుడు ఆచార్య ఈశ్వర్‌రెడ్డి, ప్రైవేటు విద్యాసంస్థల సంఘం నేత జోగి రామిరెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ బాలిరెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా నేత జనార్దన్‌రెడ్డి మాట్లాడారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని మరో మూడు బ్యాంకుల విలీనం తర్వాత అమరావతికి తరలించాలన్న ప్రయత్నం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రజలకు ఏదైనా మేలు చేయకపోగా ఉన్న ప్రధాన కార్యాలయాలను అమరావతికి తరలిస్తామని చెప్పడం.. సీమ పట్ల వివక్ష చూపడమేనన్నారు. ఇప్పటికే లోకాయుక్త, ఎంఎస్ఎంఈ ట్రైనింగ్ సెంటర్, న్యాయ విశ్వవిద్యాలయం, హైకోర్టు, నార్కోటిక్స్ కోర్టులను రాయలసీమకు లేకుండా చేశారని, రాష్ట్రమంటే అమరావతి మినహా మరొకటి లేదనట్లు ప్రవర్తించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, సంప్రదాయం ప్రకారం కడపలోనే ఏపీజీబీ హెడ్‌క్వార్టర్‌ను కొనసాగించాలని, లేనిపక్షంలో రాజకీయాలకతీతంగా అన్ని పక్షాలను, సంఘాలను, తరగతులను సమీకరించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. త్వరలోనే జిల్లా స్థాయిలో వెనుకబడిన ప్రాంతాల శ్రేయస్సు కోరుకునే సకల జనుల సదస్సు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు, వివిధ రంగాల ప్రముఖులు గాలి చంద్ర, జి.చంద్రశేఖర్, రవిశంకర్‌రెడ్డి, ఎస్ ఏ సత్తార్, సునీల్ కుమార్, రచయిత పాలగిరి విశ్వ ప్రసాద్‌రెడ్డి, డెంటల్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకుడు డీవీకే కుమార్, కార్మిక సంఘాల ప్రతినిధులు కామనూరు శ్రీనివాసరెడ్డి, సుబ్బిరెడ్డి, శివశంకర్, రామాంజనేయులు, రాజమణి, ప్రసాద్, కాంగ్రెస్ ప్రతినిధి మైనుద్దీన్, ఎల్ఐసీ సంఘాల ప్రతినిధులు శంకర్రావు, శ్రీనివాస్, నిత్యానందరెడ్డి, కస్తూరి, బ్యాంకు సంఘాల ప్రతినిధులు అబ్దుల్ అజీజ్, జగదీష్, ప్రసన్న, శివశంకర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు లక్ష్మీ రాజా, మహేష్, శ్రీనివాస్, జెవివి ప్రతినిధులు రాహుల్, వెంకటసుబ్బయ్య, నరసింహారెడ్డి, రాజు, బుద్దిస్ట్ సొసైటీ ప్రతినిధులు కుమారస్వామి, భాస్కర్ పాల్గొన్నారు.

దళారుల మాటలు నమ్మి మోసపోకండి

కడప అర్బన్: పోలీసు ఉద్యోగాల నియామకంలో దళారుల మాటలు నమ్మిమోసపోకండని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ ప్రభుత్వ ఉద్యోగమైనా, రిక్రూట్‌మెంట్లు అయినా పారదర్శకంగా నిర్వహిస్తారని గుర్తించాలని ఆయన పేర్కొన్నారు. దేహదారుఢ్య పరీక్షలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్లు, పరీక్షలు నిర్వహించే ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రచారం చేసే వారి సమాచారాన్ని డయల్ 100కు గానీ, డయల్ 112 గానీ లేదా స్థానిక పోలీసు వారికి తెలియజేస్తే, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు.

లోక కల్యాణార్థం.. లలితా పారాయణం

సామూహికంగా కోటి పర్యాయాలు పఠనం



పారాయణం చేయిస్తున్న శ్రీ విద్యాపీఠం మౌనస్వామి



అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక శ్రీ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో లోకకల్యాణార్థం ఆదివారం సామూహిక లలితా కోటినామ పారాయణం చేశారు. లలితాదేవి ఉత్సవ మూర్తికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, సర్వమానవాళి శ్రేయస్సును ఆకాంక్షిస్తూ 1000 మందిపైగా భక్తులతో 10 పర్యాయాలు సామూహిక లలితా పారాయణం చేశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం మధ్యాహ్నం 3 వరకు సాగింది. శ్రీ విద్యాపీఠం మౌనస్వామి పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. భక్తులకు శ్రీకృష్ణాలయ యాదవ సేవాసంఘం అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పారాయణ కమిటీ అధ్యక్షుడు బూతూరు వెంకట రామిరెడ్డి, ప్రొద్దుటూరుతోపాటు కడప, జమ్మలమడుగు, మైదుకూరు, కమలాపురం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

పర్మిట్ ఇచ్చేశారు!

- మద్యం షాపుల పక్కనే పర్మిట్ రూముల ఏర్పాటు
- ఉదయాన్నే తెరచుకుంటున్న వైన్ షాపులు, బార్లు
- తద్వారా 45 రోజుల్లో రూ. 110 కోట్ల మేర మద్యం అమ్మకాలు

ప్రొద్దుటూరు క్రైం : ఉదయాన్నే టీ బంకులు తెరుస్తారో లేదో గానీ మద్యం షాపులు, బార్లు మాత్రం తెరుచుకుంటున్నాయి. తెల్లారక ముందే షాపులు తెరచి వ్యాపారులు మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. ప్రజలు నిద్రమత్తులో నుంచి బయటికి రాక ముందే మందు బాబులు మద్యం మత్తుతో తూలుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు చేస్తున్నా సంబంధిత అధికారులు చూస్తుండిపోయారు. ప్రొద్దుటూరు ఎక్సైజ్ డిపో పరిధిలో 101 మద్యం షాపులు, 20 బార్లు ఉన్నాయి. ప్రొద్దుటూరుతో పాటు బద్వేల్, జమ్మలమడుగు, ముద్దనూరు, మైదుకూరు, పులివెందుల, ఎర్రగుంట్ల మండలాలు డిపో పరిధిలోకి వస్తాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వైన్ షాపుల్లో మద్యం విక్రయాలు చేయాల్సి ఉంది. అయితే ఉదయం 7 గంటల నుంచే ప్రొద్దుటూరులోని కొన్ని బార్లు, మద్యం షాపుల్లో విక్రయాలు జరుపుతున్నారు. గత జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఉన్న సమయంలో 10 గంటల కంటే ముందు తెరిచే బార్లు, మద్యం దుకాణాలపై చర్యలు తీసుకునేవారు. ఎస్పీ ఆదేశాల మేరకు స్థానికంగా ఉన్న సీఐలు, ఎస్ఐలు ఉదయం తెరుచుకునే బార్లు, మద్యం దుకాణాల నిర్వాహకులపై శాఖాపరమైన చర్యలు తీసుకునేవారు. గతంలో స్థానికంగా ఉన్న బార్ల యజమానులను పోలీసులు పిలిపించి సమయపాలన పాటించాలని ఆదేశాలు కూడా జారీ చేశారు. ఇక్కడి పోలీసు అధికారుల పర్యవేక్షణ కారణంగా అప్పట్లో ప్రభుత్వ నిబంధనల మేరకే మద్యం విక్రయాలు జరిగేవి. అయితే ఇటీవల ఉదయాన్నే కొన్ని బార్లు, వైన్ షాపులు తెరుచుకుంటున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు సాగిస్తున్నా ఎక్సైజ్ అధికారులతో పాటు పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్ణీత సమయానికే ప్రభుత్వ మద్యం షాపులు తెరిచేవారు. సమయం ముగిశాక వెళ్లిన వారికి మద్యం దొరికేది కాదు. మద్యం కావాలంటే తిరిగి ఉదయం వరకు వేచి ఉండాల్సి వచ్చేది. శాంతిభద్రతల కోణంలో చూసినా ఉదయాన్నే మద్యం అమ్మకాలు మంచిది కాదని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.



వైఎంఆర్‌కాలనీ రోడ్డులో మద్యం షాపు పక్కన ఏర్పాటు చేసుకున్న పర్మిట్ రూం



గోడౌన్ నుంచి వైన్ షాపునకు తీసుకెళ్తున్న మద్యం

మద్యం షాపుల పక్కనే పర్మిట్ ఇచ్చేశారు..

గత ప్రభుత్వ హయాంలో నిబంధనలకు లోబడే మద్యం షాపుల్లో విక్రయాలు చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక మద్యం షాపుల్లో విచ్చల విడిగా విక్రయాలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేయడంతో పాటు మద్యం దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేస్తామని సీఎం చంద్రబాబునాయుడే హెచ్చరికలను జారీ చేశారు. అయినా సీఎం హెచ్చరికలు, ఆదేశాలను అధికారులతో పాటు మద్యం వ్యాపారులు పట్టించుకోవడం లేదు. సీఎం చెప్పినా తగ్గేది లేదంటూ మద్యం షాపుల పక్కనే పర్మిట్ రూంలను తెరిచారు. అందులో బార్లను తలపించేలా సిటింగ్‌ను ఏర్పాటు చేసి మరీ మద్యం తాగిస్తున్నారు. ప్రభుత్వమే వీరికి అనుమతి ఇచ్చిందా లేక ఎక్సైజ్ అధికారులు పర్మిషన్ ఇచ్చారా అనేది తెలియాల్సి ఉంది. వైన్ షాపుల్లో పర్మిట్ రూంలను ఏర్పాటు చేసుకోవడంతో తమ వ్యాపారాలు పూర్తిగా పడిపోయాయని బార్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బార్లలో వ్యాపారాలు సగానికి సగం తగ్గిపోయినట్లు వాపోతున్నారు. ఇటీవల ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ ప్రొద్దుటూరుకు వచ్చినప్పుడు బార్ల యజమానులు స్వయంగా వెళ్లి తమ గోడును వినిపించారు. డీసీ ఆదేశాలు జారీ చేసినా ఇక్కడి మద్యం వ్యాపారులు లెక్క చేయడం లేదు.

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే ఆదేశాలు నీటి మూటలేనా..!

ప్రొద్దుటూరులోని మద్యం షాపుల యజమానులు తన వద్దకు వచ్చి పర్మిట్ రూంలను ఏర్పాటు చేసుకుంటామని అడిగినట్లు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మీడియా సమావేశంలో ఇటీవల వెల్లడించారు. అయితే ఇందుకు తాను వ్యతిరేకమని, నిబంధనల మేరకే వ్యాపారాలు చేసుకోవాలని ఎమ్మెల్యే చెప్పారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని వ్యాపారులకు, ఎక్సైజ్ అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. అయితే ఎమ్మెల్యే హెచ్చరికలను వ్యాపారులు, ఎక్సైజ్ అధికారులు, పోలీసులు ఖాతరు చేయడం లేదు. ఉదయాన్నే మద్యం షాపులు తెరుస్తున్నా, పర్మిట్ రూంలను ఏర్పాటు చేసుకున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

45 రోజుల్లో రూ.110 కోట్ల మద్యం అమ్మకాలు

రాష్ట్ర వ్యాప్తంగా నవంబర్ 16న కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రైవేట్ మద్యం దుకాణాలను ప్రారంభించారు. కొన్ని చోట్ల జనావాసాల మధ్య మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారని పెద్ద ఎత్తున ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చినా వ్యాపారులు పట్టించుకోలేదు. ప్రొద్దుటూరు ఎక్సైజ్ డిపో పరిధిలో 101 మద్యం షాపులు, 20 బార్లు ఉన్నాయి. వీటిలో పెద్ద ఎత్తున మద్యం అమ్మకాలు జరిగాయి. అక్టోబర్ నెలలో రూ. 47,20,54,799 విలువైన 61518 లిక్కర్ కేసులు, 18403 బీర్ కేసుల విక్రయాలు జరిగాయి. అలాగే నవంబర్ నెలలో రూ. 62,60,70,525 విలువ కలిగిన 82273 లిక్కర్ కేసులు, 25534 బీర్ కేసులను విక్రయించారు. కేవలం 45 రోజుల్లోనే దాదాపు 110 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి.

దాడులు చేస్తున్నాం..

ప్రొద్దుటూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిరంతరం తనిఖీలు, దాడులు నిర్వహిస్తున్నాం. చాలా వరకు మద్యం షాపుల్లో పర్మిట్‌లను పెట్టకుండా నివారించాం. ఇంకా ఎక్కడైనా ఉంటే వాటిపై కూడా చర్యలు తీసుకుంటాం. నిబంధనలను అతిక్రమించి ఉదయాన్నే వ్యాపారాలు చేస్తున్న మద్యం షాపులు, బార్లపై కేసులు నమోదు చేస్తాం.
– సురేంద్రారెడ్డి, ఎక్సైజ్ సీఐ, ప్రొద్దుటూరు.

క్లుప్తంగా

18 నుంచి రెడ్డి సేవా సమితి రజతోత్సవాలు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన రెడ్డి సేవా సమితి రజతోత్సవాలను జనవరి 18, 19 తేదీల్లో నిర్వహించనున్నామని సంస్థ అధ్యక్షుడు లెక్కల కొండారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజున నగర శివార్లలోని డీఎస్ఆర్ కల్యాణ మండపంలో రజతోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ, సభా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రెండవరోజు విశ్వకవి యోగి వేమన జయంతిని పురస్కరించుకుని నగరంలోని రాజీవ్ మార్గ్‌లో గల ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ కార్యాలయం నుంచి వేమన విగ్రహం వరకు ర్యాలీ చేపడతామన్నారు.

ఎస్సీ కాలేజి హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి



హాస్టల్‌ను పరిశీలిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని ప్రకాష్ నగర్ ఎస్సీ కాలేజి హాస్టల్ వార్డెన్ సుభాష్‌ను సస్పెండ్ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహులు కోరారు. ఆదివారం నగరంలోని ఎస్సీ హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాష్ నగర్‌లోని ఎస్సీ కాలేజి హాస్టల్ వార్డెన్ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా, దురుసుగా ప్రవర్తిస్తున్నాడన్నారు. హాస్టల్ మొత్తం దుర్వాసన వెదజల్లుతున్నా పట్టించుకోలేదన్నారు. హాస్టల్‌లో ఫ్యాన్లు కూడా కొన్ని పని చేయడం లేదన్నారు.

దుష్ప్రచారంపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రసిద్ధి గాంచిన పెద్ద దర్గా పెద్దలపై అనంతపురానికి చెందిన ముతవల్లీ షకీల్ షరీష్‌తో పాటు కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై పోలీసులు సమగ్రంగా విచారిస్తున్నారు.

బైకును ఢీకొన్న కారు

– ముగ్గురికి గాయాలు



కారు ద్విచక్రవాహనం ఢీ కొన్న దృశ్యం



కాలు విరిగిన యువకుడు

కొండాపురం : మండల పరిధిలోని వెంకటాపురం సాయిబాబా గుడి సమీపంలో తాడిపత్రి–కడప జాతీయ రహదారిలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొన్న ఘటన ఆదివారం చోటు చేసుకొంది. స్థానికుల వివరాల మేరకు అనంతపురం జిల్లా సూరేపల్లె గ్రామానికి చెందిన అశోక్, ప్రణయ్, రాము ద్విచక్ర వాహనంలో వెళుతుండగా వెంకటాపురం వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంలో వెళుతున్న ముగ్గురికి కాళ్లు విరిగినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను 108 వాహనంలో తాడిపత్రిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు.

నిజ జీవితాన్ని యథాతథంగా చిత్రించిన సన్నపురెడ్డి



మాట్లాడుతున్న రామ్‌కీ ఫౌండేషన్ రామిరెడ్డి

సాహిత్య సమాలోచన సదస్సులో రచయితలు

పోరుమామిళ్ల : జీవిత వాస్తవాలను, తన చుట్టూ ఉన్న వ్యక్తుల స్వభావాలను, పాత్రలను ఒడిసిపట్టుకుని తన కథలో, నవలలో యథాతథంగా చిత్రించడంలో సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి దిట్ట అని పలువురు కవులు, రచయితలు పేర్కొన్నారు. ఆదివారం పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రసిద్ధకవి, రామ్‌కీ ఫౌండేషన్ అధినేత రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి సాహిత్య సమాలోచన సదస్సులో పలువురు మాట్లాడారు. సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి 90 కథలు, 9 నవలలు, పలు కవితలు రచించారన్నారు. అన్ని కథలకు బహుమతులు లభించాయన్నారు. రెండు నవలలు తానా పోటీలకు ఎంపికయ్యాయని తెలిపారు. కొండపాలెం నవల సినిమాగా వచ్చిందని పేర్కొన్నారు. కాడి, పాండవబీడు, తోలుబొమ్మలాట, చినుకుల సవ్వడి, పాలెగత్తె, కొత్తదుప్పటి కథలపై చింతకుంట శివారెడ్డి, కోడూరు స్వతంత్ర బాబు, మోపూరి లలితకుమారి, గంగాదేవి, నాగార్జున, సాయిప్రసాద్‌లు విశ్లేషించారు. బతుకు సేద్యం, ఒక్కవాన చాలు, మబ్బులు వాలని నేల, బడి, కొండపాలెం కథలపై అనుగూరు చంద్రశేఖర రెడ్డి, రామిరెడ్డి, తవ్వా వెంకటయ్య, చెన్నా రామమూర్తి మాట్లాడారు. అంతకు ముందు ఉదయం జరిగిన ప్రారంభ సమావేశంలో కవిత విద్యాసాం స్కృతిక సేవాసంస్థ అధ్యక్షుడు అలపర్తి పిచ్చయ్య చౌదరి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కవులు, రచయితల విశ్లేషణల అనంతరం సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి తన స్పందన తెలియజేశారు. అనంతరం తెలుగు భాషా మిత్ర మండలి ఆధ్వర్యంలో సన్నపురెడ్డిని సన్మానించారు. ఈ సదస్సుకు వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు.

వైవిధ్య భరితమైన కవి డాక్టర్ మౌని



వక్త రాజశేఖర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : రచయిత మౌని వైవిధ్య భరితమైన రచనలు చేసి తన వైదుష్యాన్ని ప్రదర్శించారని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రాచ్య పరిశోధన కేంద్రం సహాయాంధ్ర పరిశోధకులు డాక్టర్ తొండాటి రాజశేఖర్ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 139వ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి అధ్యక్షత వహించగా, 'డాక్టర్ మౌని జీవితం – సాహిత్యం' అనే అంశంపై డాక్టర్ తొండాటి రాజశేఖర్ ప్రసంగించారు. సభాధ్యక్షులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ లబ్ధప్రతిష్టులైన రచయితలనే కాక మరుగునపడిన రచయితలను కూడా పరిచయం చేయడం నెలనెలా సీమ సాహిత్యం కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. వక్త రాజశేఖర్ మాట్లాడుతూ సాహిత్యలోకానికి మౌనిగా పరిచయమైన డాక్టర్ త్యాగదుర్గం మునిస్వామి సంప్రదాయ సాహిత్యం మొదలుకొని పదకవిత్వంతో పల్లవించి ఆధునిక సాహిత్య ప్రక్రియలన్నింటిలో కూడా ఆయన తన కవితా గళాన్ని వినిపిస్తున్నారన్నారు. డాక్టర్ మౌని కవిగా, రచయితగా, నటుడుగా, జర్నలిస్టుగా, సంపాదకులుగానే కాకుండా ప్రాచీన, ఆధునిక కవుల మార్గంలో సాహిత్యం అందిస్తున్నారని తెలిపారు. తొలుత వక్త రాజశేఖర్‌ను బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య పార్వతి, సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బందితో కలసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో ఉద్యోగుల పాత్ర కీలకం

జాతీయ గ్రామీణ బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి గణపతి హెగ్డే



మాట్లాడుతున్న జాతీయ గ్రామీణ బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి

కడప కోటిరెడ్డిసర్కిల్ : గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు కీలకపాత్ర పోషిస్తూ వస్తున్నారని జాతీయ గ్రామీణ బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి గణపతి హెగ్డే తెలిపారు. ఆదివారం స్థానిక వినాయక నగర్‌లోని డీకే ముఖర్జీ భవన్‌లో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ రుణ పరపతి విధానం మరింత శక్తివంతం చేసేందుకు 'ఒకే రాష్ట్రం.. ఒకే గ్రామీణ బ్యాంకు' అనే నినాదంతో రాష్ట్ర స్థాయి గ్రామీణ బ్యాంకుల కల సాకారం అయిందన్నారు. అదే విధంగా 'ఒకే దేశం..ఒకే గ్రామీణ బ్యాంకు' కూడా అమలు జరిగి జాతీయ గ్రామీణ బ్యాంక్ ఏర్పాటు త్వరలో సఫలీకృతం అయ్యేందుకు ఆల్ ఇండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ పీఆర్ పద్మేట్వర్ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రస్తావిస్తూ దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ రీజినల్ రూరల్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రవికాంత్, ఇతర యూనియన్ నాయకులు బిక్షమయ్య, మొహమ్మద్, హనుమంత రెడ్డి, జగదీశ్వర రెడ్డి, హరి ప్రసన్న కుమార్, బి.అబ్బులు, సురేష్, వెంకటరెడ్డి, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు విశ్రాంత ఉద్యోగులు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కేవీ సుబ్బారెడ్డి, సుబ్రమణ్యం, గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రధాన కార్యదర్శిగా కేవీ సుబ్బా రెడ్డి, అధ్యక్షుడిగా జిలానీలను ఎన్నుకున్నారు.

అశ్రునయనాల మధ్య విష్ణు స్వరూప్ అంత్యక్రియలు



ఎమ్మెల్సీ రామచంద్రయ్యను పరామర్శిస్తున్న మంత్రి ఫరూఖ్

కడప కల్చరల్ : శాసనమండలి సభ్యుడు సి.రామచంద్రయ్య కుమారుడు విష్ణు స్వరూప్ అంత్యక్రియలు ఆదివారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య నిర్వహించారు. శనివారం హైదరాబాదులో గుండెపోటుతో మరణించిన విష్ణు స్వరూప్ మృతదేహాన్ని ఆదివారం తెల్లవారుజామున కడప నగరంలోని కో ఆపరేటివ్ కాలనీలోగల రామచంద్రయ్య స్వగృహానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖమంత్రి ఫరూఖ్, కాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కొత్తపల్లి సుబ్బరాయుడు, వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబుతోపాటు పలువురు కార్పొరేటర్లు, నగర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, సీఆర్సీ బంధుమిత్రులు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కొడవలితో వ్యక్తిపై దాడి

తంబళ్లపల్లె : తాగునీటి కుళాయి వద్ద ఇద్దరు మహిళల మధ్య జరిగిన ఘర్షణ ఓ వ్యక్తిపై కొడవలితో దాడి చేసేందుకు దారితీసింది. ఈ సంఘటన ఆదివారం మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలు.. గంగిరెడ్డిపల్లెలో శనివారం హసీనా తాగునీటి కుళాయి వద్ద దుస్తులు ఉతుకుతున్న విషయమై పక్కింటిలోని కవిత ప్రశ్నించింది. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగి దుర్భాషలాడుకున్నారు. కవిత మామ గంగిరెడ్డి కల్పించుకుని హసీనాను మందలించాడు. కోపం పెంచుకున్న హసీనా శనివారం రాత్రి సత్యసాయి జిల్లా నల్లచెరువులోని సోదరులకు జరిగిన ఘర్షణ విషయాన్ని ఫోన్ ద్వారా తెలిపింది. హసీనా సోదరులు కుటుంబ సభ్యులతో ఆదివారం గంగిరెడ్డిపల్లెకు వచ్చారు. వాహనం దిగుతుండగానే గంగిరెడ్డి ఇంటిలోకి చొరబడి కోడలు కవితపై దాడి చేశారు. ఈ క్రమంలో హసీనా గంగిరెడ్డిని నరకమని సోదరులను ప్రేరేపించింది. అక్కడ ఉన్న కొడవలితో గంగిరెడ్డిని విచక్షణారహితంగా నరికారు. గంగిరెడ్డి (70) ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. వారి కేకలు విన్న స్థానికులు సంఘటన స్థలానికి రాగానే హసీనా సోదరులు వాహనంలో పరారయ్యారు. కుటుంబీకులు బాధితులను తంబళ్లపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న హెడ్‌కానిస్టేబుల్ శంకర్ సిబ్బందితో ఆస్పత్రికి వచ్చి జరిగిన సంఘటనపై బాధితులను ఆరా తీశారు.

జిల్లా కబడ్డీ జట్టు ఎంపికలకు చక్కటి స్పందన



జిల్లా బాలుర జట్టు



జిల్లా బాలికలు జట్టు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని గాంధీనగర్ నగర పాలకోన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ జూనియర్ విభాగం ఎంపికలకు క్రీడాకారుల నుంచి చక్కటి స్పందన లభించింది. ఈ ఎంపికలను జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు ఎస్. గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి టి. జనార్దన్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు జనవరి 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు కర్నూలు నగరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రూకో అగ్రిగేటర్ ఎ. సంపత్, జిల్లా కబడ్డీ సంఘం ఉపాధ్యక్షులు సుకుమార్, జుల్ఫీకర్, సంయుక్త కార్యదర్శులు ప్రసాద్, రవిశంకర్, కోశాధికారి జయచంద్ర, ప్రతినిధులు బెనర్జీ, సురేంద్ర, రాకేష్, ఈశ్వర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా బాలుర జట్టు : పవన్, వంశీ, విజయేంద్రప్రకాష్, బి. లోకేష్, బి. శివకుమార్, టి. ఉదయ్‌కుమార్, డి. నవనీత్, పి.సుదర్శన్, జి.రెడ్డిప్రసాద్, డి. వర్ధన్, ఎస్. విష్ణు, ఎస్. రిహాన్‌బాషా, స్టాండ్‌బై: ఎస్.చంటి, వై.శ్రీవిష్ణు, కె.మణికంఠ.

జిల్లా బాలికల జట్టు : పి.నాగశృతి, ఎస్.శ్యామల, కె.వెంకటపల్లవి, ఎన్.నవనీత, కె.హేమవర్షిణి, బి.భవాని, పి.అనుదీక్షిత, ఎం.ప్రమీల, సాయిహర్షిత, గురుస్పందన, టి.సౌమ్య, శ్రీవర్షిత, జె.అనూష, స్టాండ్‌బై: ఆర్. అనూరాధ, టి.శిరీష, బి.నిహితరెడ్డి.

గువ్వలచెరువు ఘాట్‌లో లారీ బోల్తా



బోల్తాపడిన లారీ

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి రహదారిలోని చింతకొమ్మదిన్నె మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్డు మూడవ మలుపు వద్ద ఆదివారం రాయచోటి వైపు నుంచి కడపకు జ్యూస్ లోడ్‌తో వస్తున్న లారీ అదుపుతప్పి ప్రహరీని ఢీకొని పది అడుగుల లోయలో పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కృష్ణ, క్లీనర్ రమేష్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పోలీసులు రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

రూట రాష్ట్ర ఉర్దూ లెక్చరర్స్ విభాగం ఏర్పాటు



సయ్యద్ వసివుల్లా, అధ్యక్షుడు



అబ్దుల్ రషీద్, ప్రధాన కార్యదర్శి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్(రూట) ఆధ్వర్యంలో ఆదివారం కడప నగరంలోని రూట కార్యాలయంలో రాష్ట్ర ఉర్దూ లెక్చరర్స్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ హిదయతుల్లా, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు హఫీజ్ షేక్ అహ్మద్‌లు రాష్ట్ర అధ్యక్షుడిగా సయ్యద్ వసివుల్లా బక్తియారి, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ రషీద్, మహిళా కార్యదర్శిగా డాక్టర్ షాజియాబేగం, సలహాదారుగా డాక్టర్ ముహమ్మద్ నిసార్ అహ్మద్, డాక్టర్ అయూబ్ హుస్సేన్, సమన్వయకర్తగా షేక్ ముహమ్మద్ అయూబ్‌లను ఎన్నుకున్నారు.

దేశ రాజకీయాల్లో సీపీఐ పాత్ర అమోఘం



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దేశ రాజకీయాలలో కమ్యూనిస్టు ఉద్యమం నిర్వహించిన పాత్ర గర్వించదగినదని, అశేష త్యాగాలతో పునీతనమైన సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్. నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని 14వ డివిజన్, ఎన్టీఆర్ నగర్‌లో ఆదివారం సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు, భూ సంస్కరణ చట్టం సాధించడంలో సీపీఐ పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎన్. వెంకట శివ, సౌత్ జోన్ నాయకులు పగడపూల మల్లికార్జున, 14వ డివిజన్ నాయకులు నారాయణ, బుజ్జి, దస్తగిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారా పార్లమెంటుకు ఎన్నికైన వారు, ఆ రాజ్యాంగాన్ని రూపొందించిన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించడం అంటే రాజ్యాంగాన్ని, దళిత జాతిని అవమానించడమేనని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మరియాపురంలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కాలేజీ విద్యార్థులను కలసి సోమవారం నిర్వహించే ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాక్షాత్తు పార్లమెంటులోనే అంబేద్కర్‌కు జరిగిన అవమానాన్ని ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి సందర్భాలలో మనం పెదవి విప్పకపోతే, పిడికిలి బిగించకపోతే, మనకు కల్పించిన హక్కులకు, మనం అనుభవిస్తున్న విలువలకు ద్రోహం చేసిన వారం అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యుడు మడగలం ప్రసాద్, దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం జిల్లా కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

నూనె యంత్రంలో పడి తెగిన చేయి

బి.కొత్తకోట : సెలవు కావడంతో తల్లిదండ్రులతో కలిసి ఆడుకుంటున్న బాలుడి చేయి నూనె యంత్రంలో పడటంతో తెగిపోయింది. ఈ సంఘటన ఆదివారం అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటలో జరిగింది. స్థానిక పోస్టాఫీసు వీధికి చెందిన నూరుల్లా, షాహినా దంపతుల కుమారుడు మహ్మద్ అయాన్ రెండోతరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులతో కలిసి బెంగళూరురోడ్డులోని నూనెగింజల ఫ్యాక్టరీకి వెళ్లాడు. అక్కడ ఆడుకుంటూ ప్రమాదవశాత్తు చేయి నూనె తీసే యంత్రంలో పడింది. దీంతో అయాన్ చెయి యంత్రంలో ఇరుక్కుని బెల్టు చుట్టూ తిరుగుతూ కుడిచేయి నలిగిపోయి మోచేయి వరకు తెగిపోయింది. అయాన్ భుజం, మెడపై తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో హతాశులైన తల్లిదండ్రులు తట్టుకోలేకపోయారు. 108లో అయాన్‌ను స్థానిక సీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు. ఇక్కడి నుంచి మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తెగిన చేయిని వెంట తీసుకెళ్లారు. తర్వాత బాలుడిని బెంగళూరు తీసుకెళ్లారు.